# ‘రా’

“యువరానర్,  పత్రికలో అచ్చయిన కథ, ‘స్స్ అబ్బా, చంపకురా!’ అనేది యువతను పెడత్రోవ పట్టించేదిగా ఉందనీ, శృంగారాన్ని గురించి తప్పుడు సమాచారం అందిస్తోందనీ , అసలది నూటికి నూరుపాళ్ళూ అశ్లీలమైన రచన అనీ కోర్టువారికి మనవి చేస్తున్నాను.ఐ.పి.సి. సెక్షన్ రెండువందల తొంభై ప్రకారం ఈ కథను నిషేధించి, ఎడిటర్‌పైనా, రచయితపైనా తగు చర్య తీసుకోవలసిందిగా కోరుతున్నాను యువతలో పెచ్చుపెరుగుతున్న విచ్చలవిడితనానికి ఈ కొద్ది విధంగానైనా అడ్డుకట్ట వెయ్యటం ఎంతైనా అవసరమని మనవి చేస్తున్నాను.”

- ప్రాసిక్యూషన్ లాయర్ (ప్రభుత్వం తరపున నిందితుడిమీద నేరారోపణ చేసే న్యాయవాది.) తన ఖంగుమనే గొంతుతో బల్లగుద్ది మరీ చెప్పాడు.

డిఫెన్సు లాయర్(నిందితుడైన ఎడిటర్ తరపు న్యాయవాది) లేచి అన్నాడు- “యువరానర్ ! నేడు పుంఖానుపుంఖాలుగా అశ్లీల రచనలు వస్తున్న మాటా, యువతను పెడత్రోవ పట్టిస్తున్న మాటా నిజమే! కానీ, కోర్టువారి పరిశీలనలో ఉన్న నాక్లయింటు ప్రచురించిన ఈ కథ మాత్రం అటువంటిది కాదని మనవి చేసుకుంటున్నాను. ఈ కథలోని ఇతివృత్తం ఒక భార్యా భర్తల జంట చుట్టూ మాత్రమే తిరుగుతుంది. భర్త కాంపు కెళ్ళి చాలాకాలానికి ఆరోజే ఇంటికొస్తాడు. భార్యాభర్తలిద్దరూ ఏకాంతంలోకి చేరతారు. భర్త ఆమె పక్కనే కూర్చుని తాను క్యాంపులో ఉన్నన్నాళ్ళూ ఎలా ఆమె గురించి ఆలోచిస్తూండే వాడో చెబుతుంటాడు. చెబుతూ చెబుతూ ఆమె తలనీ, జడనీ, చేత్తో రాస్తూ ఆమె చెవిలో స్వీట్ నేథింగ్స్ ఏవో గుసగుసలాడుతుంటాడు. ఆమె పరవశించిపోతూ మొహం స్పష్టంగా లేని ఒకానొక గంధర్వుడెవరో తనను లాలిస్తూ విమానంలో తీసుకెడుతున్నట్టు ఊహించుకుంటుంది. చటుక్కున భర్త లేస్తాడు. డ్రెస్సింగు మిర్రర్ దగ్గరకెళ్ళినుంచుని అదేపనిగా తల దువ్వుకొంటాడు. పక్కమీద ఆమె రెచ్చిపోతూ అతన్ని ఆహ్వానిస్తూంటుంది చివరికి అతనొచ్చి ఆమెని హత్తుకుంటాడు. కానీ మళ్ళీహఠాత్తుగా లేచి బాత్‌రూం కెడతాడు. ఈ నీళ్ళ చప్పుడు వింటూ ఆమె తామిద్దరూ ఆ నీళ్ళ గదిలో ఉన్నట్టూ తనని అతను అక్కడ పంపుకింద పడుకోబెట్టినట్టు ఊహించుకుని పరవశించిపోతూంటుంది. చివరికి, ఒళ్ళంతా మంచిగంధం సువాసనతో ఆ భర్త వస్తాడు. ఈమె చాలా తపనతో అతన్ని తన పక్కకి లాక్కొంటుంది. అతనామె పక్కకి చేరతాడు కానీ దిగ్గున లేచిపోయి కోపంగా “ అగు, ఇంతకాలం నువ్వు నాకొక్క ఉత్తరం కూడా రాయనందుకు నిన్ను శిక్షించక తప్పదు” అంటూ ఆమెని వెల్లకిలా పడుకోబెట్టి ఆమె చేతుల్ని తాళ్ళతో మంచంకోళ్ళకి కట్టేస్తాడు దూరంగా నుంచుని తానిప్పుడు ఆమెనేం చెయ్యబోతున్నాడో వైనవైనాలుగా వర్ణిస్తూంటాడు ఆమె తను వంటగదిలో ఉన్నట్టూ, తన భర్త తనని బలవంతంగా ఏదో చేయబోతున్నట్టూ ఊహించుకుంటుంది. ఉండుండి హఠాత్తుగా ఆమె ఏదో ఒకవంక చెప్పి కట్టు విడిపించుకుని లేచి, అతని మీద పడుతుంది రెండు మూడు క్షణాల తర్వాత మళ్ళీ అతను తిరగబడి లేచెళ్ళిపోయి పాన్‌దాన్ దగ్గర్నుంచొని, అజ్ఞగా ,“ నాకు తమలపాకులు తీసియ్యి!” అంటాడు ఆమె విసుగ్గా పక్కమీద పడిపోయి “స్స్. అబ్బా చంపకురా!” అంటుంది... అలా సాగుతుంది కాస్సేపటికి భార్యాభర్తలిద్దరూ నిద్రపోతారు ఇదీ కథ...”

జడ్జి అన్నాడు " అంతా వర్ణనే అన్నమాట! వర్ణనతో కథ నడవడటమే కష్టం , చదివించటం ఇంకా కష్టం!"

ప్రాసిక్యూషన్ లాయర్ కంగారు పడ్డాడు. డిఫెన్స్ లాయరు వైపు కోపంగా చూసి జడ్జితో అన్నాడు " కానీ, యువరానర్, ఇందులో వర్ణనలు అశ్లీలంగా ఉన్నాయి. భర్త భార్యని ఒళ్ళంతా తడమడం, భార్య విశృంఖలంగా ప్రవర్తిస్తూ తన శరీర సంజ్ఞల ద్వారా అతన్ని ఆహ్వానించడం, ఆ తర్వాత భర్త తనని సమీపించినప్పుడు శబ్దాలు చెయ్యటం వగైరాలు సభ్య ప్రపంచానికి ఏవగింపును కలిగిస్తాయి..."

చటుక్కున డిఫెన్సు లాయర్ అందుకున్నాడు. " యువరానర్! ఊహించుకొంటే అర్థమయ్యే విధంగానే ఈ కథ ఉందిగానీ, ప్రత్యక్షంగా ఎటువంటి అశ్లీల పదమూ ఇందులో వాడబడలేదు. ఇది భార్యాభర్తలకు మ త్రమే అర్థమయ్యే కథ. ఈ విధంగా ధ్వని ప్రధానంగా రాయగల్గిన రచయితనీ, ప్రచురించిన నా క్లయింట్‌నీ అభినందించాలేగాని అభిశంసించకూడదు. "

ప్రాసిక్యూషన్ లాయరు అందుకున్నాడు. " యువరానర్! అసలిందులో అశాస్త్రీయమైన అంశం ఒకటుంది. తను కోరుకొంటున్న, తను తపించిపోతున్న భర్త సాన్నిధ్యంలోనే తనున్నప్పుడు ఏ స్త్రీ అయినా, ఎవరో గంధర్వుడితో ఉన్నట్టూ, స్పష్టంగా పడకమీద ఉంటూ కూడా తను బాత్‌రూంలో ఉన్నట్టూ ఊహించుకోవటం ఏ రకంగా సాధ్యం..? ఇంకా , రెండు సార్లు ఆమెని ఆక్రమించుకున్న భర్త నిలదొక్కుకొని తీరిగ్గా తమలపాకులు కావాలనటం ఏ విధంగా సంభవం? ఇక్కడ భర్త చాలాకాలం తర్వాత ఇంటికొచ్చాడనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి."

ప్రేక్షకుల గాలరీలో కూర్చునున్న ఆడమగ జనాల్లోంచి ముసిముసి నవ్వులు పైకొచ్చాయి. జడ్జి సాలోచనగా ఇద్దరి వంకా చూశాడు. కాస్సేపు సీలింగు ఫాన్ వంక చూశాడు . తలొంచుకుని సీరియస్‌గా పెన్ను నుదురుకు రుద్దుకున్నాడు. చివరికి "దీనికి మీరేమంటారు." అన్నాడు.

డిఫెన్స్ లాయర్ నెమ్మదిగా లేచి అన్నాడు "పురుషుడు నిలబడగలగటం అనేది అతని సామర్థ్యంపైన ఆధారపడి ఉంటుందనే విషయం కుర్రాడైనప్పటికీ ప్రాసిక్యూషన్ లాయర్‌గారికీపాటికీ తెలిసుండాల్సింది- ఆయన పురుషుడు కనుక! ( గ్యాలరీలొంచి నవ్వులు) ... ఇకపోతే , భర్తవల్ల తన సంసారంలో పరిపూర్ణంగా ఎంతో తృప్తిని పొందుతున్నప్పటికి, భార్యకి ఆమె అంతరాంతరాల్లో ఉండే కలలేవో ఆమెకి ఉంటూనే ఉంటాయి. ఇది ప్రతిగృహిణికి తెలిసిన విషయం."

ప్రాసిక్యూషన్ లాయర్ సర్రున లేచాడు. "ఇక్కడ రచయిత స్త్రీకాదే? స్త్రీ అనుభూతులు పురుషుడి కెట్లా తెలుస్తాయి?"

" కానీ, రచయితకి భార్య ఉందనే విషయం ఎంక్వైరీ రిపోర్టులో ఉంది ఆమె స్త్రీయే గదా! అసలయినా, 'రవి కాననిచో కవి కాంచును గదా' అని ఉండనే ఉంది గదా." గ్యాలరీలోంచి మళ్ళీ ముసిముసి నవ్వులు లేచాయి. ప్రాసిక్యూషన్ లాయర్ మళ్ళీ అన్నాడు."యువరానర్, అసలు ఈ 'అబ్బా..' కథ విషయంలో..."

" అబ్జక్షన్ ! 'ఇస్స్, అబ్బా చంపకు రా' కథ "... " ఆ!అదే! అదేలెండి! ఈ కథవిషయంలోనే ఎడిటర్ ముందుగా రాసిన వ్యాఖ్య- 'భార్యాభర్తల మధ్య ప్రవహించే శృంగార విద్యుత్తును జల్లెడపట్టి కాచి, వడపోసి, ఒలికించిన కథ ఇది' -లో ప్రవహించే అనేమాట మా నెక్స్‌ట్ అబ్జక్షన్ పాయింట్! కథకు

వేసిన బొమ్మ మా ఇంకో అబెక్షన్!'' డిఫెన్సు లాయర్ ఏదో చెప్పబోయాడు. జూరీ(జడ్జికోసం ఏర్పాటైన సలహాదారుల బృందం ) లోంచి ఒకరు లేచి నుంచొని ఇలా అన్నాడు '' యువరానర్, ఈ అచ్చయిన కథను చెప్పించుకొని వినటం కాక మీరు స్వంతంగా చదివితే, మీరే ఒక నిర్ణయానికి రాగలుగుతారు. లేచిపోవడం కేసులు రెండూ, లేపుకుపోవడం కేసులు మూడు ఈ రోజు విచారణకు వుండగా ఈ చిన్న కేసుమీద కాలం వ్యర్థం చేయడం మంచిది కాదని మా అభిప్రాయం.'' తెరిపిన పడ్డట్టు ఊపిరి పీల్చుకున్నాడు జడ్జి '' సరే, కేసును పైనెల ఈ తేదీకే వాయిదా వేస్తున్నాను.'' ఆ సాయంత్రం ఆ కట్ట కాగితాలన్నీ దస్త్రంలో కట్టుకుని ఇంటికి వెళ్ళాడు.

★ ★ ★

జడ్జి ఇంకా ఆ కథని చదవనే లేదు. ఆ ఊళ్ళోనే కాపురం ఉంటున్న అతని కూతురొచ్చి '' నాన్నా అ కథ కాగితాలోమాటిస్తావా? రెండురోజుల్లో తెచ్చిచ్చేస్తాను'' అంది. ''ఎందుకమ్మా '' అన్నాడు జడ్జి. '' అఁ ఏంలేదు, కోర్టుకేసుందిగా, అందులో ఏముందో చూద్దామని!'' తండ్రి ఇచ్చాడు. కూతురుతీసుకెళ్ళింది. ఇరవైరోజుల తర్వాత తీసుకొచ్చి తల్లి కివ్వబోయింది.తల్లి '' ఇంతాలస్యం అయిందేమమ్మా?'' అంది. '' ప్రాసిక్యూషన్ లాయరుగామ్మాయి తీసుకెళ్లిందమ్మా, వాళ్ల ఫ్రెండు క్కూడా ఇచ్చిందట '' ...'' ఆ అమ్మాయి కెందుకే?'' తికమక పడింది తల్లి. '' ఎందుకేంటీ? తన మొగుడికి నేర్పుకోటానికి '' అంటూ లో గొంతుతో '' నేనూ అందుకే గదే తీసుకెళ్లింది!'' అంది. '' బాగానే ఉంది సంబడం!'' కాగితాలనందుకుంది తల్లి.

★ ★ ★

ఆ సాయంత్రం భార్యతో సినిమా కెళ్ళొచ్చాడు జడ్జి. అర్థరాత్రయింది. ఏదో రాసుకుంటూ కూర్చున్న జడ్జి మీదికి అతని భార్య వెనకనుంచి వాలిపోతూ '' రండి, పడుకుందాం'' అంది.

జడ్జి లేవలేదు. రాత ఆపలేదు. '' ఈ మధ్య మనమ్మాయి హుషారుగా ఉంటోంది. అల్లుణ్ణి అంటుకొని తిరుగుతోంది గమనించారా?''... '' ఎప్పట్నించీ?'' జడ్జి అడిగాడు. '' అదుగో ఆ కోర్టుకథ తీసుకెళ్ళినప్పట్నుంచీను!'' జడ్జి కళ్ళు మెరిశాయి. ఆమె మళ్ళీ అంది.'' ఆ ప్రాసిక్యూషన్ లాయర్ గారల్లుడు పెళ్ళాన్ని హనీమూన్‌కి తీసుకెళ్లడానికి తొందరపడ్తున్నాడట.'' జడ్జి ఆమె వంక లోతుగా చూస్తూ '' ఈజిట్? వెరీ గుడ్'' అన్నాడు. ఏదో ఆలోచనతో అతని మొహం వెలుగుతోంది.

ఆమె తమలపాకులు తెచ్చి పెట్టింది. భర్తని మళ్ళీ రమ్మని పిలిచింది. చివరికి లేచెళ్ళి అతని మొహం నిండా ముద్దులు పెట్టింది . కసిక్కిన అతని చెవి కొరికి కైపుగా '' అబ్బ, రారా!'' అంది. జడ్జి అన్నాడు, '' రారా! రా - ఏమిటి, చిన్నపిల్లలాగా!'' ... '' చిన్నపిల్లకేం తెలుసు 'రా' కున్న ఊపు!.. రా!''

జడ్జి అమె వంక తేరిపార చూశాడు .చూసిచూసి హఠాత్తుగా ''యాస్, యాస్, దొరికింది లీగల్ పాయింట్! సారీ మేడమ్ ఈ పూటకి నన్నొదిలేయ్'' అన్నాడు వెంటనే కథ కాగితాలు అందుకున్నాడు. అమె మెటికలు విరిచి వెళ్ళి దుప్పటి ముసుగు పెట్టేసుకుంది.

★ ★ ★

వాయిదా రోజున కోర్టు హాలు జనంతో కిటకిటలాడిపోయింది - ముఖ్యంగా పత్రికల వాళ్ళతో. అప్పుడప్పుడు ఎగ్గొట్టే లాయర్లు ఆపూట ఎగబడొచ్చేశారు కోర్టుకు జడ్జి తన తీర్పు ప్రకటించాడు. '' ఈ

కథకు ప్రాసిక్యూషన్ వారు ఆరోపిస్తున్న ఆరోపణలేవీ నేరాలుగా నాకు కనిపించడం లేదు కాగా, నత్తనడకతో నడుస్తున్న సంసారాలు కొన్ని ఈ కథ వల్ల జెట్ స్పీడందుకున్న దాఖలాలు నా దృష్టికి వచ్చాయి పోతే, ప్రాసిక్యూషన్‌వారి దృష్టికిరాని, అశ్లీలం కాని అశ్లీలమైన పాయింటొకటి ఇక్కడ ముఖ్యమైనది. ఏ భార్యఅయినా తన భర్తని 'రా' అని పిలిచిందంటే వారిద్దరి మధ్య అన్యోన్యత గాఢంగా ఉందని అర్థం ఈ కథలో భార్యచేత 'చంపకు-రా' అని రచయిత అనిపించడం, పవిత్రమైన ఆ గాఢతను సూచించడమే! ఇది పైకి అశ్లీలతగా కనుపించినప్పటికీ అశ్లీలత కాదు సరిగదా, పరిణతి చెందిన శృంగారం! సంసారం చెయ్యటంలో కొంతదూరం సాగినవారు- అంటే పాతిక ముప్పయ్యేళ్ళు వయసు దాటిన వాళ్ళు మాత్రమే అసంకల్పితంగా ప్రదర్శించే శృంగారం! అందుచేత పెళ్ళి కాని యువతీ యువకులకు ఇది అర్థం అవుతుందని కానీ, ఈ కథ వల్ల యువత పెడత్రోవ పడుతుందని కానీ నేననుకోను... ఈ కారణాల వల్ల కేసును కొట్టేస్తున్నాను...

" అయితే ఆ 'రా' ను తీసేసి 'ఇస్స్ , అబ్బా చంపకు!' అని ఆపేస్తే ఆమె తన భర్తతో ' ఇంటి పని ఇంత చేసొచ్చాను. ఇంకా తమలపాకుల పని చెబుతావా?' అని విసుక్కుంటున్నట్లు సమర్థించుకోవచ్చు. ఇది అందరికీ అర్థమయ్యేభాష . కథ ఇంకా బాగుండే భాష కనక ఆ 'రా' ను తీసేయమని రచయితకీ, ఆ విధంగా ప్రకటించమని ఎడిటర్‌కీ సూచిస్తున్నాను."

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 28-6-89)

*** *** ***

# శక్తి

నరసాపురం నుంచి విజయవాడకెళ్ళే బస్సు తాడేపల్లిగూడెం కాలవగట్టు స్టాపులోకి వచ్చి ఆగింది. డ్రైవరు దిగాడు. కండక్టరు కూడా దిగుతూండగా ఎవరో "ఇక్కడ బస్సు ఎంతసేపు ఆగుతుందండీ?" అని అడిగారు. కండక్టరు, "పది నిముషాలు ఆగుతుంది. కాఫీ తాగి రావచ్చు" అని చెప్పి దిగాడు. బస్సు కండక్టరు ముందువైపుకు నడిచి, రోడ్డుదిగి, గుడిసెల్లోకి వెళ్ళి మాయమయ్యాడు. కాఫీ తాగాలనుకున్న ప్రయాణీకులు ఓ అరడజను మంది కూడా దిగారు. వాళ్ళు దిగీ దిగ్గానే ఓ పది పన్నెండుమంది కొత్తగా లోపలికి ఎక్కారు. ఆ ఎక్కిన వాళ్ళలో వయస్సు వచ్చిన ముగ్గురు ఆడపిల్లలు కూడా ఉన్నారు.

కండక్టరు చెప్పిన పది నిముషాలవ్వగానే దిగిన వాళ్ళంతా ఒక్కొక్కరుగా వచ్చి బస్సు ఎక్కారు. ఇంకొంచెం సేపటికి కండక్టరు వచ్చాడు. వస్తూనే టిక్కెట్ల హాండిల్ అందుకొని, "టికెట్" అంటూ సీట్ల మధ్యకు వచ్చాడు. అంటూనే హడావుడిగా ముందుకు నడుస్తూ మళ్ళీ, "టికెట్ ప్లీజ్, టికెట్" అన్నాడు. కొత్తగా ఎక్కిన వాళ్లు చాలామంది చిత్రంగా ఏలూరు, ఆపై ఊళ్లకు వెళ్లేవాళ్లే! వాళ్లలో చాలామంది ఐదు, పది రూపాయల నోట్లు తీస్తారు కండక్టరు ఒక్కొక్కళ్లనీ ఊరడుగుతూ, అందరి దగ్గరా డబ్బు తీసుకున్నాడు. పోగయిన నోట్లు పట్టుకొని, తన సీట్లో కూర్చుని, జేబులు తడుముకొని, ఆశ్చర్యం ప్రకటిస్తూ లేచి నుంచుని, "అరెరె, ఆయన దగ్గర పంచి పుచ్చుకోవటం మర్చిపోయానే"అంటూ టికెట్ల హాండిల్‌ను రాక్‌లో పడవేసి, లేచి, దిగబోయాడు